మహిళల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం చర్యలు

ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం, న్యూస్‌టుడే: జిల్లాలో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో డీఆర్‌డీఏ పీడీ రత్నాకరరావు ఆధ్వర్యంలో గిరిజన మహిళా రైతులకు వెదురు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ ప్రశాంత్‌కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో వాణిజ్య పంటగా జీడిమామిడి ఉందన్నారు. దీంతో పాటు ప్రస్తుతం వెదురు సాగుతో ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దీనిలో భాగంగానే

మహిళా రైతులకు వెదురు మొక్కలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ ప్రశాంత్‌కుమార్

మహిళా రైతులకు ఉచితంగా వెదురు మొక్కలను సరఫరా చేస్తున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఒక్కో మహిళా రైతుకు 37 సెంట్ల భూమిలో 60 మొక్కలను సాగు చేసుకొనేందుకు చర్యలు చేపట్టాం. జిల్లాలో 10 వేల మంది మహిళా రైతులకు 6లక్షల మొక్కలను అందిస్తున్నాం. రైతులు వేసుకొన్న వెదురు మొక్కలు సంరక్షణ రెండేళ్ల పాటు వీబీ-జీ రాంజీ పథకం ద్వారా నిర్వహణ బాధ్యతలను చేపడతామన్నారు. నాలుగేళ్లు దాటిన తర్వాత ప్రతి ఏడాది ఒక్కో మహిళా రైతుకు రూ.40వేల ఆదాయం వస్తుందన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కె.బాలకృష్ణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కుర్ల రాజశేఖరరెడ్డి, మండల కన్వీనర్ పీఆర్‌పీ శ్రీను, మండల తెదేపా అధ్యక్షుడు పెంటపాటి అనంతమోహన్, తెదేపా అరకు పార్లమెంటు ఉపాధ్యక్షుడు అడబాల బాపిరాజు, డ్వామా పీడీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాత గౌరిదేవిపేటలో హైస్కూల్ భవనాలను కూల్చివేసి భూమిని చదును చేసిన స్థలం

కన్నేసాడు.. కూల్చేశాడు..

అనుమతులు లేకుండా ఎకరం స్థలాన్ని చదును చేసిన వైకాపా సానుభూతిపరుడు

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాక మండల పరిధిలోని పాత గౌరిదేవి పేట గ్రామంలో గోదావరి ఒడ్డున ఎకరం స్థలంలో ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరింది. దీంతో అక్కడ ఉన్న పాఠశాలను గౌరిదేవిపేటలోకి మార్చారు. ప్రస్తుతం పాతగౌరిదేవిపేటలో ఉన్న పాఠశాల భవనాలు నిరుపయోగమయ్యాయి. ఆ భవనాలపై గన్నవరం గ్రామానికి చెందిన వైకాపా సానుభూతిపరుడి కన్ను పడింది. అది ప్రభుత్వ స్థలం అయినా సరే ఎటువంటి అనుమతులు లేకుండా ఇటీవల కూల్చివేసి.. చదును చేయించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక వీఆర్వో కన్నమ్మ తహసీల్దార్ శ్రీనివాసరావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ శ్రీనివాసరావు భవనాల కూల్చివేతపై ఆరా తీసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్‌కు వీఆర్వో అందించిన ఫిర్యాదులో వైసీపీ సానుభూతిపరుడు ఒకరు పాఠశాల భవనాలను కూల్చి ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు చదును చేశాడని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ ఘటనపై విచారణ చేపట్టేందుకు మంగళవారం అధికారుల కమిటీ సభ్యులు ఘటనా స్థలానికి రానున్నట్లు సమాచారం.

తుప్పల్లో ట్యాంకులు.. లీకులతో పైపులు

ఈనాడు పరిశీలన

జిల్లాలో గ్రామీణ నీటిపారుదలశాఖ, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తాగునీటి పథకాలను ఏర్పాటు చేశారు. ఈ తాగునీటి విభాగాలను పంచాయతీలు నిర్వహణ బాధ్యతలను చేపట్టి గ్రామాల్లో తాగునీరు సరఫరాను చేస్తున్నారు. జిల్లాలో చేతిపంపులు 6,250 ఉన్నాయి. వీటిలో మరమ్మతులకు గురైన కొన్నింటికి వెంటనే మరమ్మతులను చేపట్టే పనులు ఆయా పంచాయతీలు తీసుకుంటున్నాయి. గ్రామీణ నీటిపారుదల శాఖ ద్వారా 585 మంచినీటి ట్యాంకులను, గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ విభాగం ద్వారా 146ట్యాంకులను ఏర్పాటు చేశారు. వీటిని ప్రస్తుతం పట్టించుకోకపోవడంతో జిల్లాలో చాలాచోట్ల ట్యాంకులు తుప్పల్లో అధ్వానంగా ఉన్నాయి. మరికొన్ని లీకులతో వృథాగా పోతున్నాయి. వాటిలో కొన్నింటిని 'న్యూస్‌టుడే' పరిశీలించింది. – న్యూస్‌టుడే, బృందం

అస్తవ్యస్త నిర్వహణతో అవస్థలు..

మారేడుమిల్లి: మారేడుమిల్లిలోని కొండపై రెండు ట్యాంకులను నిర్మించి, వాటి ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఆయా ట్యాంకుల్లోకి సత్యసాయి తాగునీటి పథకంతో పాటు, వేటుకూరు వెళ్లే దారిలో ఉన్న నీటి పథకం ద్వారా నీటిని నింపి సరఫరా చేయడం జరుగుతుంది. అయితే ఆయా ట్యాంకులను నిర్దేశిత గడువులోగా శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ, అటువంటి ఛాయలేమీ కనిపించడం లేదు. ఆయా ట్యాంకుల నిర్వహణ పట్టించుకోకపోవడంతో వాటిపై మొక్కలు పెరిగిపోతున్నాయి.

మారేడుమిల్లిలో లీకవుతున్న పైపులైన్లకు కట్టిన గుడ్డలు

రంపచోడవరం ఎస్టీ కాలనీలో ట్యాంకు వద్ద లీకవుతున్న తాగునీరు

శుభ్రం చేసి ఆరునెలలు దాటింది..

రంపచోడవరం: జిల్లా కేంద్రమైన రంపచోడవరంలో మసీదు కొండపై ఉన్న 90వేలు, 40వేలు లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులతో పాటు ఎస్టీ కాలనీలో ఉన్న లక్ష లీటర్ల మంచినీటి ట్యాంకు ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ఈమూడింటిని శుభ్రం చేసి సుమారు ఆరు నెలల పైబడుతోంది. దీంతో ట్యాంకుల వద్ద, వాల్మీకిపేటలో పైపులైన్లు పగిలిపోయి కొళాయిలకు నీటిసరఫరా చేసినప్పుడు నీరంతా వృథాగా బయటకుపోతుంది.

నింపామా.. వదిలేమా.. అంతే

వీఆర్‌పురంలో పిచ్చి మొక్కలు, చెట్లు మధ్య నీటి ట్యాంకు

వరరామచంద్రాపురం: వీఆర్‌పురంలో దాదాపు 30 వరకు భారీ ట్యాంకులతో తాగునీటి పథకాలు ఉన్నాయి. వీఆర్‌పురం, కుందులూరు, పెద్దమట్టపల్లి, వడ్డిగూడెం, చింతరేవుపల్లి, జీడిగుప్ప, పోచవరం తదితర గ్రామాల్లోని ట్యాంకులు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. అక్కడక్కడా ట్యాంకుల నుంచి సరఫరా ఉన్నా, ఆట్యాంకులు ఏడాదికి ఒకసారి శుభ్రం చేయడం కష్టమే.

నాలుగు నెలలైనా కన్పించని క్లోరినేషన్



కూనవరం పంచాయతీ కార్యాలయం వద్ద పిచ్చిమొక్కలతో నీటిట్యాంకు

కూనవరం: కూనవరం మేజరు పంచాయతీలో తాగునీటి సరఫరా ట్యాంకులను నాలుగు నెలలైనా క్లోరినేషన్ చేయడం లేదు. నీటి ట్యాంకు పిచ్చి మొక్కలతో దారుణంగా కన్పిస్తుంది. పలు చోట్ల లీకులు కన్పిస్తున్నాయి.

శిథిలావస్థకు చేరిన పథకం

జడ్డంగిలో విరిగిన మెట్లతో తాగునీటి పథకం..

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలంలో మొత్తం 642 చేతి పంపులు ఉండగా 21 మరమ్మతులకు గురయ్యాయి. 109 రక్షిత మంచినీటి పథకాలు ఉండగా 5 పనిచేయడం లేదు. జల్‌జీవన్ మిషన్‌లో మొదటి విడతలో 71 పనులు మంజూరుకాగా అన్నీ పూర్తిచేశారు. కానీ రెండో విడతలో 57 పనులు మంజూరైతే 17 పనులు పూర్తికాగా మరో 7 పనులు జరుగుతున్నాయి. జడ్డంగిలో 40 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న తాగునీటి పథకం శిథిలావస్థకు చేరుకుంది. మెట్లు విరిగిపోయాయి.

పింఛను మంజూరు చేసి ఆదుకోండి

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి అడ్డతీగల మండలం నూకరాయి గ్రామానికి చెందిన ఊలెం ధర్మరాజు. ఓ ప్రైవేటు వాహనంపై డ్రైవర్‌గా పనిచేసేవారు. మూడేళ్ల కిందట భార్య ఉషాతో కలసి ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం యర్రవరం వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో భార్య మృతి చెందడంతో పాటు తనకు వెన్నెముక విరిగిపోయి పూర్తిగా దివ్యాంగుడు అయ్యారు. దీంతో తన ఇద్దరు పిల్లలను పోషించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నానని.. తనకు సదరం ధ్రువపత్రాన్ని మంజూరుచేసి.. దివ్యాంగ పింఛను ఇప్పించాలని కలెక్టర్ దినేష్ కుమార్‌ను పీజీఆర్‌ఎస్‌లో కోరారు. – న్యూస్‌టుడే, రంపచోడవరం

నేడు 46,487 మందికి పింఛన్ల పంపిణీ

రంపచోడవరం, న్యూస్‌టుడే: జిల్లాలోని 12 మండలాల్లో 'ఎన్టీఆర్ భరోసా' పథకం ద్వారా మంగళవారం 46,487 మంది లబ్ధిదారులకు రూ.19,51,78,000లను పంపిణీ చేయనున్నారు. ఉదయం నుంచి పింఛన్లను పంపిణీ చేసేందుకు డీఆర్‌డీఏ పీడీ దాసరి రత్నాకరరావు చర్యలు చేపట్టారు. జిల్లాలో రంపచోడవరం డివిజన్‌లో 36 మందికి, చింతూరు డివిజన్‌లో 11 మందికి నూతనంగా వితంతు పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. దీంతో రెండు డివిజన్లు కలిపి 47 మంది లబ్ధిదారులకు రూ.1,88,000లు అందజేస్తామన్నారు.

నీ చూపు.. వారి జీవితానికి దారిచూపు

కాకినాడ సమీపంలోని ఉప్పాడకు చెందిన నూకరాజు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. కంటి చూపు పూర్తిగా మందగించడంతో ఆసుపత్రికి వెళ్లారు. బాదం బాలకృష్ణ ఐబ్యాంకు వారు సేకరించిన రెండు కార్నియాలను ఆపరేషన్ చేసి అమర్చారు. ఇప్పుడు బాగా కనిపించడంతో పాటు, ఆటోడ్రైవర్‌గా తిరిగి ఉపాధి పొందగలుగుతున్నారు.

విజయవాడకు చెందిన యువతికి గతంలో అక్షరాలు సక్రమంగా కనిపించడం లేదని ఆసుపత్రికి వెళ్లింది. చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. దీంతో కార్నియాలు అమర్చాలని చెప్పారు. అలా ఐ బ్యాంకు వారు సేకరించిన కార్నియాలు ఆపరేషన్‌చేసి అమర్చడంతో ఇప్పుడు చక్కగా చదువుకోగలుగుతుంది.

చనిపోయిన వ్యక్తి నుంచి కార్నియాలను సేకరిస్తున్న బాదం బాలకృష్ణ ఐబ్యాంకు నిపుణులు

న్యూస్‌టుడే, గాంధీనగర్

మనిషి చనిపోయాక నేత్రాలు దానం చేస్తే మరో ఇద్దరికి చూపు ప్రసాదిస్తాయి. వాటిని కార్నియల్ అంధులకు అమర్చడం ద్వారా కారు చీకట్లు కమ్ముకున్న వారి జీవితాల్లో వెలుగు లభించే అవకాశం ఉంది.

నేత్రదానంతో పలువురికి కొత్త జీవితం

ఉమ్మడి జిల్లాతోపాటు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల వాసులకు సేవలందించే లక్ష్యంతో కాకినాడ ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డులో 2006లో బాదం బాలకృష్ణ ఐబ్యాంకును స్థాపించారు. దీని ద్వారా ఎందరో అంధులకు వెలుగులు ప్రసాదించారు.

ప్రత్యేక ఐ బ్యాంకులు..

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలా సుమారు 70వేలకు పైగా నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాలు స్వచ్ఛందంగా సేకరించారు. ఇప్పటివరకు 8040 కార్నియాలను సేకరించి, కార్నియల్ అంధత్వ నివారణకు ఉపయోగించారు. ✦ జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో తొలిసారిగా కాకినాడలో లకంసాని వీరిన్ మానస్ రెడ్‌క్రాస్ ఐ బ్యాంకును 2024లో ప్రారంభించారు. ఇప్పటి వరకు 548 కార్నియాలు సేకరించి, కార్నియల్ అంధులకు దృష్టిని ప్రసాదించారు.

నేత్రదానం చేసేదిలా..

నేత్రదానం వ్యక్తి మరణానంతరం మాత్రమే జరుగుతుంది. మృతిచెందిన 4-6 గంటల్లోపే కార్నియాను సేకరించాలి. కంటి నల్లగుడ్డుపైన ఉండే పొర(కార్నియా)ను శిక్షణ పొందిన టెక్నీషియన్లు 15నిమిషాల్లో తీసి భద్రపరుస్తారు. అనంతరం వాటికి వివిధ పరీక్షలు నిర్వహించి, ఎటువంటి లాభాపేక్ష లేని ఆసుపత్రులకు పంపించి కార్నియల్ అంధులకు దృష్టిని ప్రసాదిస్తారు. కంటి శుక్లాలు(కేటరాక్ట్) ఆపరేషన్ చేయించుకున్నవారు, కళ్లజోడు పెట్టుకునేవారు, అన్ని వయస్సుల వారు నేత్రదానం చేయొచ్చు.

అంధత్వం లేని రాష్ట్రంగా ...

ఆంధ్రప్రదేశ్‌ను కార్నియల్ అంధత్వం లేని రాష్ట్రంగా మార్చేందుకు రెడ్‌క్రాస్ పనిచేస్తుంది. ఈక్రమంలో మొదటిసారిగా కాకినాడలో రెడ్‌క్రాస్ ఐబ్యాంకును ప్రారంభించాం. ఇతర జిల్లాల్లోనూ కార్నియా కలెక్షన్ సెంటర్‌లను ఏర్పాటు చేశాం. నేత్రదానానికి విస్తృత ప్రచారం చేస్తూ, అంధత్వ రహితంగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

-వై.డి.రామారావు, రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్, కాకినాడ

ఎవరైనా మరణిస్తే నేత్రదానం చేయదలచినవారు ఈ నంబర్లకు సమాచారమిస్తే టెక్నీషియన్లు వచ్చి కార్నియాలను సేకరిస్తారు.

బాదం బాలకృష్ణ ఐబ్యాంకు – 99897 99456, 94907 10666

లకంసాని వీరిన్ మానస్ రెడ్‌క్రాస్ ఐబ్యాంకు- 94913 13388

11న సింహగిరిపై వరలక్ష్మీ వ్రతాలు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 11న సింహగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈవో జల్లేపల్లి వెంకటరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయ ఉత్తర గోపురం ఎదురుగా వార్షిక కల్యాణోత్సవ వేదిక వద్ద వ్రతాలు జరుగుతాయని పేర్కొన్నారు. వీటిలో పాల్గొనే గృహిణులకు దేవస్థానం ఉచితంగా పూజా సామగ్రి, కొండ దిగువకు, పైకి ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తుందని తెలిపారు.

త్వరలో పీడీఎఫ్ ఖాతాల్లో పరిహారం జమ

చింతూరు పీవో శుభం నొక్వాల్

చింతూరు, న్యూస్‌టుడే: పోలవరం పరిహారం పొందిన గ్రామాల్లో పరిహారం నగదును నిర్వాసితులు సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కళాజాతాలను ఏర్పాటు చేసినట్లు చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విలీన మండలాల్లోని 32 గ్రామాల్లో నిర్వాసితులకు ఇప్పటివరకు ఇంటికి, భూములకు పరిహారం అందజేశామని, ప్రస్తుతం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ప్రక్రియ చేపట్టామని చెప్పారు. నిర్వాసితులకు రూ.లక్షల్లో వారి ఖాతాల్లో జమ చేస్తున్న దృష్ట్యా వాటిని సద్వినియోగం చేసుకునేలా చైతన్యం చేసేందుకు ఈ కళాజాతాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పీడీఎఫ్‌లకు త్వరలో వారి ఖాతాల్లో పరిహారం జమ చేస్తామని, ఇప్పటికే వన్ టైమ్ సెటిల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిర్వాసితుల డబ్బులు కాజేసేందుకు అధిక వడ్డీలిస్తామని, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని కొందరు నిర్వాసితులను మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అలాంటి వారి మాటలు నమ్మకుండా నగదు నిర్వహణపై అవగాహన కల్పించేందుకు కళాజాతాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల ఒకటిన చింతూరులో, రెండో తేదీన చూటూరులో, 3వ తేదీన ఏజి కొడేరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. చింతూరు, వీఆర్‌పురం, కూనవరం మండలాల్లో ఒకటో తేదీ నుంచి 9 వరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పారదర్శకత పెంచేలా.. సేవలు సులువుగా అందేలా

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ఇప్పటివరకు ప్రతి సోమవారం మండల, డివిజన్, కలెక్టరేట్, స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)ను నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో నిర్వహణ, వినతుల స్వీకరణపై ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టింది. దీనిలో స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. దీంతో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇకపై సెలవు దినాలు మినహా ప్రతిరోజు స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)ను విధిగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

● ప్రతిరోజు స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో పీజీఆర్‌ఎస్

జిల్లా వివరాలు ఇలా..

స్వర్ణ గ్రామ కార్యాలయాలు:	140
విధుల్లో ఉన్న సిబ్బంది :	1,322

పనసలపాలెం స్వర్ణ గ్రామ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

కీలక ఉద్యోగులు అందుబాటులో ఉండేలా..

స్వర్ణ గ్రామ కార్యాలయాలకు సర్వే, వ్యవసాయ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, ఏఎన్ఎమ్‌లు ఉదయాన్నే వచ్చి సంతకాలు చేసి వివిధ సర్వేలు, పనుల పేరుతో బయటకు వెళ్తున్నారు. అర్జీలు ఇవ్వడానికి వస్తున్న ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో చిన్నపాటి సమస్య పరిష్కారానికి కూడా పలువురు కలెక్టరేట్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పీజీఆర్‌ఎస్ నిర్వహించినప్పుడు కీలక ఉద్యోగులు అంతా ఆయా కార్యాలయాల్లోని ఉండి వినతులు స్వీకరిస్తారు.

మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు

సచివాలయ సిబ్బందిలో జవాబుదారీతనం, సేవల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా పనిదినాల్లో పీజీఆర్‌ఎస్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రోజూ స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో మధ్యాహ్నం మూడు నుంచి అయిదు గంటల వరకు అన్ని విభాగాల సిబ్బంది విధిగా అందుబాటులో ఉండాలి. సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలి. గ్రామ స్థాయిలోనే సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ఈ వేదిక ముఖ్య ఉద్దేశం.

- యాదగిరీశ్వరావు, కుమార్, బాపన్నదొర, ఎంపీడీవోలు రాజవొమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం

రామలింగేశ్వరునికి పుష్పాభిషేకం

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలోని రామలింగేశ్వర స్వామి వారికి శ్రావణమాసం సోమవారం సందర్భంగా పుష్పాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

జాహ్నవి మృతిపై విచారణకు కమిటీ

కూనవరం, న్యూస్‌టుడే: కోతులగుట్ట గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న జాహ్నవి తీవ్రమైన తలనొప్పి, వాంతులతో ఆదివారం మృతిచెందిన విషయం విదితమే. ప్రస్తుతం ఆ వివాదంపై విచారణకు కమిటీ ఏర్పాటు చేసినట్లు చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ తెలిపారు. ఐటీడీఏ ఏపీవోను కన్వీనర్‌గా, డీడీ, డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్‌లు సభ్యులుగా కమిటీలో ఉంటారన్నారు. విద్యార్థిని మృతి ఘటనకు దారితీసిన పరిస్థితులు, అందించిన వైద్యం, పాఠశాల, వసతిగృహం సిబ్బంది స్పందన, వైద్యశాలకు తరలించిన విధానం, తదుపరి జరిగిన పరిణామాలపై వారంలో విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా కమిటీకి ఆదేశాలు జారీ చేశామన్నారు.

జిల్లాస్థాయిలో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను స్థానిక ఆర్యా రెసిడెన్సీలో ఈ నెల 2న బుధవారం జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కుర్ల రాజశేఖరరెడ్డి, మండల కన్వీనర్ పీఆర్‌పీ శ్రీను తెలిపారు. ఈ వేడుకలకు జిల్లాలో అన్ని మండలాల అధ్యక్షులతో పాటు జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు. కేక్ కటింగ్‌తో పాటు బైక్ ర్యాలీని నిర్వహించి అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలను అందించనున్నామన్నారు.

WANTED DOCTORS
We Require Full time Specialist Doctors MD, MS or Diploma in a Reputed Hospital in Rajahmundry.
If Interested Please Contact:
Dr. Subhash
Bommana Hospitals
Rajahmundry
99665 30364

రాలుతున్న పసిమొగ్గలు..

మన్యంలో గురుకులాలను పట్టించుకోని అధికారులు

– న్యూస్‌టుడే, వరరామచంద్రాపురం

నెల క్రితం వీఆర్‌పురం మండలంలోని సోములగూడెం విద్యార్థులు కలుషిత ఆహారంతో 20 మందికిపైగా ఇబ్బందులు పడ్డారు. ★ తర్వాత వారంలోనే రాజవొమ్మంగి మండలం జడ్డంగి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని అనారోగ్యంతో మృతిచెందింది. ★ 15 రోజుల కిందట సున్నంవారిగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు 12 మందికి విషజ్వరాలు వ్యాపించాయి. వరుసగా మూడు వసతి గృహాల్లో విద్యార్థులకు రేఖపల్లి వైద్య బృందం ర్యాపిడ్ సర్వే చేయగా 30 మందికిపైన జ్వరపీడితులు బయటపడ్డారు. వెంటనే వైద్యశిబిరాలు నిర్వహించి, వైద్యం అందించారు. ★ రెండు రోజుల క్రితం కూనవరం మండలం కోతులగుట్ట గురుకుల బాలికల పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని తెల్లం జాహ్నవి (12) అనారోగ్యంతో మృత్యువాత పడింది. అధికారులు చర్యలు చేపడుతున్నా విద్యార్థుల మృత్యువాతలు ఆగడం లేదు.

గత నెలలో చికిత్స పొందుతున్న సోములగూడెం విద్యార్థినులు

సమస్యలు ఇలా..

● ఆశ్రమాల్లో ఏఎన్ఎంలు, వార్డెన్ పోస్టులు నియామకం లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ● పాఠశాల ప్రాంగణం, మరుగుదొడ్లు శుభ్రం చేసి, వాడిన మురుగు నీటిని పాఠశాల చుట్టుపక్కలే ఉంచుతున్నారు. మురుగుతో దోమల పెరుగుదలతో విద్యార్థులు వీటి కాటుకు గురవుతున్నారు. ● విద్యార్థులపై పర్యవేక్షణ కరవవడంతో అనారోగ్యం పాలవుతున్నారు.

ఎందుకు ఇలా జరుగుతోంది..?

వసతిగృహాలు కలిగిన విద్యాలయాల్లో నిర్లక్ష్య ధోరణి కన్పిస్తుంది. దీని ప్రభావం ఒక్కొక్కసారి విద్యార్థుల ప్రాణాల మీదకి తెస్తుంది. పాఠశాల్లో బోధనలో చాలా మంది పనిచేస్తుంటారు. వసతిగృహాల్లో సిబ్బంది ఉండటం లేదు. ప్రతి హాస్టల్‌కి రెగ్యులర్ వార్డెన్ పోస్టులు లేకపోవడంతో, ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో ఉన్న ఉపాధ్యాయులతో ఏడాదికి ఒకరు చొప్పున రొటేషన్ పద్ధతిలో వార్డెన్‌గా అదనపు విధులు నిర్వహిస్తుంటారు. ఆ ఉపాధ్యాయులు ఒకే సమయంలో ఇటువార్డెన్‌గా, మరోవైపు ఉపాధ్యాయునిగా పాఠ్యాంశాలు బోధించడంతో ఈఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో ఒక్కరే ఉండటంతో హస్టళ్లపై పర్యవేక్షణ తగ్గి.. విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిశీలించడం, పట్టించుకునేవారు లేక అనారోగ్యాల పాలవుతున్నారు. కొన్ని సందర్భాల్లో గుర్తించినా.. సాధారణ సమస్యగా పరిగణించి.. ఎక్కువైతే చూద్దాంలే అన్నట్లుగా వదిలేస్తున్నారు.

ఏఎన్ఎంల ఏర్పాటు ప్రతిపాదనల్లో ఉంది

ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎం పోస్టులు ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. వచ్చిన వెంటనే తీసుకుంటాం. ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్ పోస్టు ఏర్పాటు చేసి, భర్తీచేస్తే, నాణ్యమైన ఆహారంతోపాటు, విద్యార్థుల ఆరోగ్యంపై భద్రత పెరుగుతుంది. అది ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం. కోతులగుట్ట పాఠశాల విద్యార్థిని జాహ్నవి మృతికి సంబంధించిన విచారణ కమిటీలో నేను ఉన్నాను. కారణాలు తెలుసుకుంటాను.

– రుక్మాంగదయ్య, డీడీ, పోలవరం జిల్లా

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

వెరికోస్ వెయిన్స్
ఉచిత శిబిరం
12 సెప్టెంబర్, 2026 (ఉ॥ 9 గం॥ నుంచి సా॥ 5 గంటల వరకు)
ఉచితం
డా. నితిన్ రిమ్మలపూడి
కన్సల్టేషన్ & వీనస్ డాప్లర్ స్కాన్
విలువ ₹ 5000/-
డెల్టా హాస్పిటల్స్
deltahospitals.com
వెంకటేశ్వర నగర్, రాజమండ్రి.
రిజిస్ట్రేషన్ కోసం కాల్ చేయండి.
85230 44338

(c) eenadu

రక్షిత భవనంతో భయం

మేడిచర్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల భవనాలను ఆనుకొని ఉన్న శిథిల తుపాను రక్షిత భవనంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 35 ఏళ్ల కిందట పాఠశాల ఆవరణలో ఈ భవనాన్ని నిర్మించారు. దీని నిర్వహణ లేకపోవడంతో క్రమంగా శిథిలావస్థకు చేరింది. కొన్నాళ్ల కిందట దీనిలో రెవెన్యూ కార్యాలయాన్ని, పాఠశాల తరగతులు, రైతు సేవా కేంద్రాలను నిర్వహించే వారు. పూర్తిగా శిథిలమై స్లాబు పెచ్చులూడుతుండడంతో వాటిని వేరే చోటికి మార్చారు. ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఎప్పుడు కూలుతుందోనని పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయుడు త్రిమూర్తులు వద్ద ప్రస్తావించగా పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

– న్యూస్‌టుడే, మలికిపురం

అయినవిల్లికి పోటెత్తిన భక్తజనం

సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా సోమవారం అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. పెద్దఎత్తున విచ్చేసి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్నారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వివిధ రుసుముల ద్వారా ఆలయానికి రూ.3,91,368 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

– న్యూస్‌టుడే, అయినవిల్లి

సినిమా చెట్టు.. పట్టించుకుంటే ఒట్టు

ఆ మామిడి చెట్టు కింద సీతారామయ్య గారి మనవరాలు వంటి ఎన్నో ఉత్తమ చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. ఈ ప్రాంతంలో సినిమా చిత్రీకరణకు వచ్చిన డైరెక్టర్లు సెంటిమెంట్‌గా ఇక్కడ ఒక్కసీన్ అయినా తీయకమానరు. అలాంటిది నేడు నిర్వహణ కరవైంది. స్థానిక బ్యాంక్ కెనాల్ లాకులకు ఆనుకుని ఉన్న ఈ చెట్టు నీటి ఒరవడికి చుట్టూ మట్టి కొట్టుకుపోయింది. వేర్లు బయటపడి వచ్చి పడిపోయేలా ప్రమాదకరంగా ఉంది. గట్టు పటిష్ఠం చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సాయిమాధవ ప్రసన్న వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

సత్యదేవుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని పూజలాచరించిన అనంతరం న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు ఆశీస్సులు అందించారు. డిప్యూటీ కమిషనర్ బాబూరావు సత్యదేవుని చిత్రపటం, స్వామి ప్రసాదం అందించారు.

2న జనసేన యువజన విభాగం ఆవిష్కరణ సభ

పిఠాపురం: జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు పండుగలా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పిఠాపురంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 2న పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా యువజన విభాగ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదేరోజు లోగో ఆవిష్కరణ ఉంటుందని, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వేడుకలు జరుగుతాయన్నారు. కాకినాడ జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు కలిపి జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఆ రోజున 10 వేల మందితో చిత్రాడ నుంచి పిఠాపురం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించేందుకు జనసేన నేతలతో సమీక్షించినట్లు చెప్పారు. యువజన విభాగం ఆవిష్కరణకు పదివేల మంది హాజరవుతారని, ఆ దిశగా స్థానిక సభ ప్రాంగణం సిద్ధమవుతుందన్నారు. కేరళ నుంచి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేస్తారని, ఆయన ప్రసంగాన్ని వీక్షించేందుకు భారీ స్క్రీన్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జెన్‌జీ ఆశయాలకు తగ్గట్టుగా యువజన విభాగం పని చేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే దొరబాబు, ఓదూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో తాత్సారం.. చివర్లో తడబాటు

న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు

వచ్చే ఏడాది జరిగే గోదావరి మహా పుష్కరాల సమయంలో నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఇప్పటినుంచే ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. ప్రధానమైన వైనతేయ, వశిష్ఠ నదీ తీరాల్లో నిర్దేశించిన ప్రదేశాల్లో ఘాట్ల ఆధునికీకరణకు ఆమోదం వచ్చినా టెండర్ల ప్రక్రియ చేపట్టకపోవడం గమనార్హం. సకాలంలో పనులకు ఉపక్రమించి వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తిచేస్తే అన్నివిధాల శ్రేయస్కరంగా ఉంటుంది. నిర్మాణాల పరంగా లోటుపాట్లు చక్కదిద్దుకోవడం, అక్కడ అవసరమైన ఇతర మౌలిక సదుపాయాల పరంగా పనులు చేసుకునేందుకు వెసులుబాటు కలుగుతుందని భక్తులు అంటున్నారు. నిధుల మంజూరుకు ఆమోదం వచ్చిందని హెడ్‌వర్క్స్ ఏఈఈ టీవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. టెండర్ల దశ పూర్తికాగానే పనులు చేపడతామని చెప్పారు.

అప్పనపల్లిలో ఛిద్రంగా మారిన ఘాట్

32 ప్రాంతాల్లో ఆమోదం వచ్చినా..

మొత్తం రూ.14.98 కోట్ల వ్యయంతో వశిష్ఠ నదికి కుడివైపున 13, వైనతేయకు కుడివైపున 5, ఎడమ వైపున 14 ఘాట్లు నిర్మించేందుకు పరిపాలనా అనుమతి వచ్చింది. ఇందులో ప్రధానమైన మూడుచోట్ల ప్రత్యేకంగా దృష్టిపెట్టాల్సి ఉంది. ■ అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానం సమీపంలో 30 మీటర్ల మేర ఉన్న ఘాట్‌ను 50 మీటర్లకు విస్తరించనున్నారు. సోంపల్లిలో 30 మీటర్లు, అంతర్వేదిదేవస్థానంలో 50 మీటర్లకు పెంచి పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తారు. మిగతా 29 ఘాట్లను విస్తరించకుండా ఉంచి అవసరమైన మరమ్మతులు, సౌకర్యాలు కల్పిస్తారు. ■ ప్రతి ఘాట్‌కు మెట్లను పటిష్ఠం చేయడంతో పాటు లోతు జలాల్లోకి వెళ్లకుండా ఇనుప కమ్మీలతో కవచాలు ఏర్పాటు చేస్తారు. చుట్టూ గుంతలు, బురద లేకుండా చదును చేస్తారు. మెట్లు ఎక్కి దిగేందుకు ప్రత్యేకమైన టైల్స్ వేస్తారు. పనులు పూర్తిచేసి వాటిని రంగులతో అలంకరిస్తారు. ■ అల్లవరం మండలం బోడసకుర్రు, గోపాయలంక, గోడి, వాకలగరువు, బెండమూర్లంక, అంబాజీపేట మండలం తొండవరం, పి.గన్నవరం, ముంజవరం, వై.కొత్తపల్లి, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి తదితర చోట్ల పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

నదీపాయ	ఘాట్ల మంజూరు	నిధులు (రూ.కోట్లు)
వైనతేయ కుడి	5	3.05
వైనతేయ ఎడమ	14	5.68
వశిష్ఠ ఎడమ	13	6.25

గత అనుభవాల నేపథ్యంలో..

■ గత పుష్కరాల్లో పలుచోట్ల కొత్తగా నిర్మించిన, అభివృద్ధి చేసిన ఘాట్‌లను ఎవరూ పట్టించుకోకపోవడంతో చాలావరకు దెబ్బతిన్నాయి. మెట్లు విరిగి, గుంతలు పడ్డాయి. పోటు నీటి ప్రభావంతో కిందిభాగంలో కోతబారిన పడ్డాయి. ■ అప్పనపల్లి, అంతర్వేది దేవస్థానం సహా పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ ప్రతిరోజూ వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తుంటారు. ■ సోంపల్లిలో అంత్యక్రియలు, పిండ ప్రదానాలకు సంబంధించి అనేక మంది స్నానాలకు వెళ్తుంటారు. ఇక్కడ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ■ ఇటువంటి ప్రదేశాల్లో విస్తరణ, ఆధునికీకరణ దిశగా చేపట్టే పనులు పటిష్ఠంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉంది.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్

నిరసన తెలుపుతున్న కొబ్బరి ఒలుపు, దింపు కార్మికులు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొబ్బరి ఒలుపు, దింపు కార్మికులకు ధరలు పెంచి ఆదుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. అయినవిల్లి మండలం కొబ్బరి ఒలుపు కార్మికుల పట్ల కులవివక్ష చూపిన వ్యాపారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలన్నారు. జిల్లాలో 30వేల మంది కార్మికులు ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. వారి కోసం కొబ్బరి కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారావు, కారెం వెంకటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

185 అర్జీల స్వీకరణ

మహిళ సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వస్తున్న అర్జీలకు సకాలంలో పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 185 మంది తమ సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిని అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు.

వాడపల్లి క్షేత్రంలో నేటి పూజలు

● కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుని ఆలయంలో మంగళవారం ఉదయం 5 గంటలకు ప్రభాతసేవ, మేలుకొలుపు, వేంకటేశ్వర సహిత లక్ష్మీఐశ్వర్య హోమం, ద్రవిడ వేద పారాయణం, నివేదన ● 6 గంటలకు గోపూజ, అష్టోత్తర నామార్చన పూజలు, దర్శనాలు ప్రారంభం. 10.30 గంటలకు నిత్య కల్యాణం, 12 గంటలకు అర్చన ● మధ్యాహ్నం ఒంటిగంట నుంచి విరామం, 4 నుంచి మళ్లీ దర్శనాలు ప్రారంభం. ● సాయంత్రం 6 గంటలకు అర్చన, 7.30 గంటలకు నైవేద్యం. 8 గంటలకు పవళింపు సేవ.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

సమస్యలు తెలుసుకోవడానికే ప్రజాదర్బార్

వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన పలువురు 39 అర్జీలను మంత్రికి అందించారు. తాగునీటి వసతి, విద్యుత్తు సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై వచ్చిన వినతులను మంత్రి పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు.

ప్రపంచ కొబ్బరి దినోత్సవం రేపు

అంబాజీపేట, న్యూస్‌టుడే: ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 2న అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో వేడుకలు నిర్వహించనున్నట్లు ముఖ్య శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి పి.అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 4.15 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, కోస్టల్ జోన్-1 డి.వెంకటస్వామి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎస్.సూర్యకుమారితో పాటు పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని కొబ్బరిపంట ఉత్పత్తి పెంపు, సాంకేతికతతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, తోటల సాగు, తెగుళ్లు, పురుగుల నివారణ తదితర అంశాలపై చర్చిస్తారని ఆయన వెల్లడించారు.

లాభాల్లో మునగంగ

వీబీజీ రామ్‌జీలో రైతులకు మొక్కల సరఫరా

న్యూస్‌టుడే, అంబాజీపేట

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా సాగుచేసే కొబ్బరితోటల్లో అంతరపంటగా పండించే మునగలో రైతులు లాభాలు ఆర్జించేలా ప్రభుత్వం చేయూతనందిస్తోంది. కొబ్బరితోటలతో పాటు ఖాళీ భూముల్లో ఈ పంటను సాగు చేసుకుని రైతులు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వీబీజీ రామ్‌జీ పథకంలో రైతులకు మునగమొక్కలను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. మార్కెట్‌లో మునగకాయలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆధునిక విధానంలో సాగు చేసుకుని కర్షకులు లాభాలు పొందేలా ప్రోత్సాహం అందిస్తున్నారు.

కోనసీమలో సాగవుతున్న తోట

రెండేళ్ల పాటు రూ.96,000

అంతరపంటగా మునగను సాగుచేసే రైతులకు రెండేళ్ల పాటు రూ.96 వేలను వీబీజీ రామ్‌జీ పథకంలో అందిస్తున్నారు. కొబ్బరితోటల్లో అంతరపంటగా సాగుచేయడానికి వీలుగా ఎకరానికి 448 మునగ మొక్కలు సరఫరా చేస్తున్నారు. ఒక మొక్క రూ.8 చొప్పున పంట కాపునకు వచ్చే వరకు నిర్వహణ ఖర్చులతో కలిపి రెండు సంవత్సరాలకు రూ.96 వేల చొప్పున రైతు బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. పంట చేతికి వచ్చిన తరవాత నుంచి మార్కెట్‌లో డిమాండ్, ధరలను బట్టి రైతులు లాభాలే ఆర్జిస్తారు. మరోవైపు మునగ తోట పెంపకంతో రైతులకు ఏమాత్రం నష్టం ఉండదు. వీటికి ప్రత్యేకించి పోషణ అవసరం లేదు. కొబ్బరితోటలకు పెట్టే సాగునీరు, ఎరువులు, ఇతర పోషకాలు ఈ మొక్కలకు నేరుగా అందుతాయి కాబట్టి కర్షకులు పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక మునగకాయ రూ.10 నుంచి రూ.12 వరకు విక్రయమవుతోంది. మొక్కనాటిన 6 నెలల నుంచి 8 నెలలకు కాపునకు వస్తుంది. ఇలా మూడు నుంచి అయిదేళ్ల పాటు కాపునిచ్చి రైతుకు ఆదాయం తెచ్చిపెడుతుంది. ఎకరా పొలంలో నాటిన చెట్ల నుంచి టన్నుల కొద్దీ మునగకాయలు దిగుబడి వస్తాయి. వీబీజీ రామ్‌జీలో సాగుకు నగదు జమ చేయడంతో రైతులకు ఆర్థికభారం కూడా ఉండదు. ఒక చెట్టుకు తొలి ఏడాదిలో 200 నుంచి 250 కాయలు, రెండో సంవత్సరంలో 350 నుంచి 500 వరకు కాయలు దిగుబడి వస్తాయి. ఎకరానికి ఏడాదిలో 10 నుంచి 15 టన్నుల దిగుబడి ఉంటుంది. అంటే సుమారు 2 లక్షల నుంచి 2.5 లక్షల కాయలు ఉత్పత్తి అవుతాయి. మార్కెట్‌లో ప్రసుతం కిలో ధర రూ.40 నుంచి రూ.55 వరకు పలుకుతోంది.

సూపర్ ఫుడ్..

మునగకాయలను సూపర్ ఫుడ్ లేదా ప్రకృతి ప్రసాదించిన దివ్యౌషధంగా పిలుస్తారు. కాయల కంటే ఆకుల్లోనే విటమిన్లు, ఖనిజాలు విటమిన్ ఏ, సీ, కాల్షియం, ఐరన్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. రోగ నిరోధక వ్యవస్థను బలపర్చడంలో ఇవి సాయపడతాయి. చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి.

ఆసక్తిగల రైతులు సంప్రదించాలి..

కోనసీమ జిల్లాలోని కొబ్బరితోటల్లో అంతరపంటగా మునగ సాగుచేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు నేరుగా కార్యాలయంలో సంప్రదించాలి. లేదా ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీబీజీ రామ్‌జీ క్షేత్ర సహాయకులను కూడా సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

– అడపా శ్రీవెంకటకృష్ణ, ఏపీవో, అంబాజీపేట

ఆధార్‌కు తాళం వేయడం తెలుసా..?

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

మీ కోసం

సైబర్ నేరాల నియంత్రణ, వ్యక్తిగత వివరాల గోప్యతకు ఆధార్‌కు తాళం వేయడం ఎంతో ఉపయోగపడుతుంది. తరచుగా సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలో నిల్వలు ఖాళీ చేస్తున్న ఘటనలు చూస్తున్నాం. అలాంటి నేరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఆధార్‌పై దృష్టిపెట్టి దాన్ని లాక్ చేసుకోవడం మంచిది. దీనివల్ల మీ వ్యక్తిగత వివరాలు నేరగాళ్ల చేతికి చిక్కవు. అలాగే దుర్వినియోగం చేయడానికి వీలుండదు.

ఏం చేయాలంటే..

ఆధార్‌కు తాళం వేయడానికి మీ చరవాణిని ఉపయోగించుకోవచ్చు. ముందుగా మై ఆధార్ యాప్‌లోకి వెళ్లాలి. హోం పేజీలో కనిపించే ఆధార్ లాక్, అన్ లాక్ యూఐబీ బటన్ ఎంపికచేయాలి. ఆధార్‌లోని 12 అంకెలు, పూర్తి పేరు, పిన్‌కోడ్, సెక్యూరిటీ కోడ్ నమోదు చేయాలి. అనంతరం సెండ్ ఓటీపీపై క్లిక్‌చేస్తే రిజిస్టర్ ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఆ నంబర్‌ను నమోదు చేస్తే ఆధార్ లాక్ అవుతుంది.

ఇవీ ఉపయోగాలు..

ఆధార్‌ను లాక్ చేయడంలో వ్యక్తిగత సమాచారం, బయోమెట్రిక్ వివరాలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా సురక్షితంగా ఉంటాయి. మీ ఆధార్‌తో ఎవరైనా సిమ్ కార్డులు తీసుకోవడం, కొత్తగా బ్యాంకు ఖాతా తెరవడం కుదరదు. అలాగే ప్రభుత్వ రాయితీలను దుర్వినియోగం చేసేందుకు అవకాశం ఉండదు. అలాగే ఆధార్ జెరాక్స్ ఇతరుల చేతికి చిక్కినా ఎవరూ ఏమీచేయలేరు. వేలిముద్రలు, కంటిచూపు (ఐరిస్)తో లాక్ చేయడంతో అనుమతి లేకుండా ఎవరూ లావాదేవీలు నిర్వహించడానికి వీలుండదు. ఆధార్‌తో అనుసంధానం చేసిన పాన్‌కార్డు, ఓటర్ గుర్తింపుకార్డు, బ్యాంకు ఖాతాలకు రక్షణ లభిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ సమాచారం బహిర్గతం కాదు. అన్ని విధాలా వ్యక్తిగత వివరాలకు రక్షణ లభిస్తుంది.

పరీక్షల విధానాన్ని సమూలంగా సంస్కరించాలి

ప్రసంగిస్తున్న జయప్రకాష్ నారాయణ

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: పాఠశాలల్లో పరీక్షల విధానాన్ని సమూలంగా సంస్కరించాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ వ్యాఖ్యానించారు. రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పలపాటి మాచిరాజు ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన సత్కార సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుత పరీక్షా విధానం మొక్కుబడిగా సాగుతోందని చెప్పారు. పరీక్షలంటే విద్యార్థులు ఎంతవరకు నైపుణ్యం సాధించారో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైన్స్ జీవితంలో ఒక భాగంగా మారాలని, అది సమస్యల పరిష్కారానికి హేతువు కావాలన్నారు. మరో ముఖ్యఅతిథి మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ విద్య జీవితంలో ఎదగడానికి ఒక ఆయుధంలా మారాలని చెప్పారు. అనంతరం హెచ్ఎం మాచిరాజు దంపతులను జయప్రకాశ్ నారాయణ, మంత్రి సుభాష్, పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.

యువతిని మోసం చేసిన కేసులో..
మాజీ కానిస్టేబుల్‌కు జైలు, జరిమానా

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన కేసులో మాజీ పోలీస్ కానిస్టేబుల్‌కు కోర్టు 12 ఏళ్ల 3 నెలల జైలుశిక్ష, రూ.7 వేలు జరిమానా విధించింది. కేసు వివరాలను ఎస్పీ రాహుల్ మీనా సోమవారం వివరించారు. రాజానగరం పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న యువతికి 2022లో మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ఉండ్రు అభిషేక్(29) ఇన్‌స్టాలో పరిచయమయ్యాడు. తనకు అర్థమెటిక్ సబ్జెక్ట్ తెలుసని స్టడీ మెటీరియల్ ఇస్తానని పరిచయం పెంచుకున్నాడు. తనను పెళ్లిచేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి బలవంతంగా తాళి కట్టాడు. శారీరకంగా దగ్గరైన తర్వాత మొహం చాటేశాడు. దీనిపై ఆ యువతి 2023, ఏప్రిల్ 17న అమలాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. అనంతరం సీఐ టి.క్రాంతికుమార్ కోర్టులో ఛార్జిషీట్ వేశారు. నిందితుడిని 2024లో ఉద్యోగం నుంచి తొలగించారు. రాజమహేంద్రవరం కోర్టులో పీపీలు కె.రాధాకృష్ణరాజు, తుమ్మల వాసు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో 8వ అదనపు జిల్లా సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి బి.నిర్మల తీర్పు చెప్పారు. పట్టణ సీఐ వీరబాబు, డీఎస్పీ టీఆర్ఎస్‌కే ప్రసాద్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ డి.మురళి, కోర్టు కానిస్టేబుల్ సురేష్‌ను అభినందించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 8142292071.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై మార్టిగేజ్ లోన్స్, Govt. ఎంప్లాయీస్, రిటైర్డ్ పెన్షనర్సుకు పర్సనల్ లోన్స్, స్థిరాస్తి ఏ బ్యాంక్‌లో ఉన్నా జిరాక్స్ పేపర్సుపై 2nd మార్టిగేజ్ లోన్. నోసిబిల్, అయోధ్య సొసైటి, Cell: 9666547338.

HEALTH & CARE

మద్యపానం మానేయడంఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు రాజమండ్రి శ్రీ సాయిలక్ష్మీ లాడ్జి, SVG మార్కెట్ రోడ్, ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా, ప్రతీనెల 3,17 తేదీల్లో మందులు.

REAL ESTATE

GENERAL

విశాఖపట్నం, మధురవాడ, సింహాచలం, ఆనందపురం, భోగాపురం ఏరియాల్లో ప్లాట్స్ కొనాలన్నా అమ్మాలన్నా సంప్రదించండి Cont: ✆ 8790921259.

PLOT FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి సిటీ 10వ వార్డులో తక్షణమే ఇంటి నిర్మాణానికి రుడా(RUDA) అప్రూవ్డ్ స్థలాలు అమ్మకమునకు కలవు. Contact Cell: 99122 15786.

TO LET

రాజమండ్రి-జాంపేట: ఎలక్ట్రికల్ ఆఫీసు వెనుక వీధిలో సుమారు 11'6"x11'2" గల రెండుషాపులు కలిపిగాని, విడిగా గాని అద్దెకు. సంప్ర. ✆ 63011 36401.

JOBS

Managers/Asst. Managers in Insurance Company is Above 40 yrs Salary 30K+ Others Contact Cell: 90108 09384.

Wanted Female HR Person for Hospital at Rajahmundry. Immediately Contact Cell: 76749 99909.

DEW FOAMS PRIVATE LIMITEDలో చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: MBA 1-2 సం||లు అనుభవం గల వారికి ప్రాధాన్యత. రెజ్యూమ్ పంపవలసిన ఈ-మెయిల్: hodewfoamsegmail.com. Cont: ✆ 81795 19955.

శ్రీలక్ష్మీ వెంకటేశ్వరా వెహికల్ ఫైనాన్షియర్స్, తాడితోట నందు పనిచేయుటకు ఆఫీస్ స్టాఫ్ (35 సం||), కలెక్షన్ బాయ్స్ (25 సం||) కావలెను. సం: 96662 19999.

కాకినాడ LVM రెడ్ క్రాస్ ఐ బ్యాంకు నందు టెక్నీషియన్‌గా పనిచేయుటకు అనుభవం గల ఇంటర్ సైన్స్ పాసైన వారు కావలెను. Contact: 91826 60025, 0884-2371409.

RJY, KKD, అన్నవరంల్లో సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ కావలెను. జీ|| 12 to 15 వేలు. రూం+భో||. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి 9392269369, 9492144369.

నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ టెక్నికల్ ఆపరేషన్స్‌లో అనుభవంగల M/F 8 మంది కావలెను. 2 సం|| అనుభవం ఉండాలి. రాజమండ్రిలో నూతనంగా ప్రారంభించిన NBFC నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ హెడ్ ఆఫీస్ రాజమండ్రి నందు మాత్రమే పనిచేయుటకు కావలెను. అయోధ్య బిజినెస్ ఫైనాన్స్ Pvt. Ltd., ✆ 9100233999, 9866248160.

రాజమండ్రిలో హాస్పిటల్ నందు పనిచేయుటకు GNM/ B.Sc. నర్సులు అర్జెంటుగా కావలెను. Contact Cell: 76749 99909/06.

రాజమండ్రిలో ప్రముఖ కన్‌స్ట్రక్షన్ ఆఫీసు నందు పనిచేయుటకు అకౌంటెంట్, సివిల్ ఇంజినీర్, సైట్ సూపర్‌వైజర్, రిసెప్షనిస్ట్ and PRO కావలెను. Contact Cell: 80991 91919.

EENADU for Advertisement Contact: 8008597607

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-55 పై|| అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	16,000
పాతకాయ: గండేరా	23,500
గటగట	21,000
కొత్తకాయ: గండేరా	23,000
గటగట	20,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-21,000
కొత్త (పచ్చి) కాయ	20,000-21,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	257-00

ప్రాణాపాయం నుంచి బాలికను కాపాడిన వైద్యులు

భద్రాచలం, న్యూస్‌టుడే: ప్రాణాపాయ స్థితిలో ఉన్న గిరిజన బాలికకు భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు అత్యవసర వైద్య సేవలు అందించి కాపాడారు. పోలవరం జిల్లా చింతూరు మండలం బొడ్డు రాయిగూడెం గ్రామానికి చెందిన ఎస్.వెంకటలక్ష్మి(14) తీవ్ర అనారోగ్యంతో గత నెల 26న ఇక్కడి ఆసుపత్రిలో చేరింది. ఇక్కడ చేరక ముందు వారం నుంచి జ్వరం వచ్చి స్థానికంగా చికిత్స పొందింది. ఈ క్రమంలో ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆరు రోజుల కిందట కుటుంబ సభ్యులు ఇక్కడకు తీసుకొచ్చినప్పుడు హిమోగ్లోబిన్ 2 గ్రాములు ఉంది. రక్తం తక్కువగా ఉండటంతో పాటు ఎలక్ట్రోలైట్ లెవల్స్ అసాధారణ స్థితిలో ఉన్నాయి. దీంతో శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడింది. మెరుగైన వైద్యం కోసం వేరేచోటికి పంపించేందుకు ప్రయత్నించినప్పటికీ బాలిక కుటుంబ సభ్యుల పరిస్థితి కారణంగా ఇక్కడే ఉంచి అత్యంత క్రిటికల్ కేసుగా గుర్తించి సేవలందించారు. విడతలవారీగా అవసరమైన రక్తం ఎక్కించారు. ఫిట్స్ రాకుండా జాగ్రత్తలు పాటించారు. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రించి కామెర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రెస్పిరేటరీ సపోర్ట్ వంటి చికిత్సలను అందించడంతో బాలిక ఆరోగ్యం కుదుటపడింది. నిపుణులైన ప్రభుత్వ వైద్యులపై ఆ కుటుంబం ఉంచిన నమ్మకంతో ఇది సాధ్యమైందని కోలుకున్న బాలికను సోమవారం డిశ్చార్జి చేశామని సూపరింటెండెంట్ డా.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ వైద్య సేవలు అందించిన పిల్లల వైద్యుడు డా. క్రాపా విజయ్, నర్సింగ్ సిబ్బంది డా. రాజ్యలక్ష్మిలను అభినందించారు.

అత్యధిక మార్కులతో ప్రతిభ చాటాలి

మామిడికుదురు, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే అన్ని సబ్జెక్టులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి అత్యధిక మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రతిభ చాటాలని డీఈవో షేక్ మహబూబ్‌బాషా అన్నారు. ఈదరాడ జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే ఆరోగ్యం, పోటీల్లో పతకాలు సాధించగలరన్నారు. డీవైఈవో కిశోర్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఈదరాడలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో మహబూబ్ బాషా

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

కొండవాడ గ్రామస్థులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గ్రామస్థులు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించే ఆస్కారం ఏర్పడుతోందని బోదులూరు పీహెచ్‌సీ వైద్యాధికారి నితిన్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలో బోదులూరు పీహెచ్‌సీ పరిధిలోని కొండవాడ గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గిరిజనులకు వైద్యపరీక్షలను నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి మలేరియా, టైఫాయిడ్, మధుమేహం, రక్తపోటు తదితర పరీక్షలు చేశారు. వైద్యుడు నితిన్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనులు పోషకాహారంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. విధిగా దోమ తెరలను వాడాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ సుమలత, ఏఎన్ఎం చిన్నమ్మి, రాములమ్మ, ఎల్టీ పండుదొర తదితరులు పాల్గొన్నారు.

ఓజుబందలో క్వారీతో నష్టపోతున్నాం

రంపచోడవరం, న్యూస్‌టుడే: గంగవరం మండలం జగ్గంపాలెం పంచాయతీ ఓజుబంద గ్రామంలో నల్లరాయి క్వారీ వల్ల తమకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని స్థానిక ఐటీడీఏ ఎదుట గిరిజనులు ఆందోళన చేశారు. జేసీ ప్రశాంత్‌కుమార్, ఆర్డీవో స్వాతి గిరిజనుల వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకొన్నారు. గిరిజనులు మాట్లాడుతూ క్వారీకి అమర్చుతున్న బాంబుల వల్ల తమ ఇళ్లన్నీ బీటలువారుతున్నాయని, పంటలకు తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. దీనిపై ఈ నెల 3న గురువారం ఓజుబంద గ్రామంలో గ్రామసభ పెట్టి ప్రజల అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకొంటామని జేసీ ఆందోళన చేస్తున్న వారికి హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనలను విరమించారు.

క్వారీని వ్యతిరేకిస్తూ ఐటీడీఏకి ర్యాలీగా వస్తున్న ఆదివాసీలు

మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

గంగవరం, న్యూస్‌టుడే: మహిళల భద్రత, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పోలవరం జిల్లా డీఎస్పీ పి.అష్రాఫ్ అలీ అన్నారు. మండలంలోని కొత్తాడలో సోమవారం గ్రామస్థులు, గిరిజన సంక్షేమ ఆశ్రమబాలుర ఉన్నత పాఠశాల వసతిగృహం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అడ్డతీగల సీఐ గజేంద్రకుమార్, గంగవరం ఎస్సై వెంకయ్య ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు భద్రత, నేపాల్ వరదలు తదితర అంశాలపై డిజిటల్ తెరపై వీడియోలు చూపిస్తూ చైతన్యం కలిగించారు. విద్యార్థులు పాఠశాల దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని డీఎస్పీ సూచించారు. గ్రామాల్లో ఎక్కడ అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన పోలీస్‌శాఖ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏఎస్సై రత్నాకర్, హెచ్‌సీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తాడలో గ్రామస్థులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

కంటి సంరక్షణపై జాగ్రత్తలు అవసరం

దుప్పులపాలెంలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి నాగదివ్య

అడ్డతీగల, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారు, ఇతర వృత్తుల వారు కంటి సంరక్షణపై తగిన జాగ్రత్తలు పాటించాలని దుప్పులపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి నాగదివ్య అన్నారు. సోమవారం దుప్పులపాలెం పీహెచ్‌సీలో ఆప్తాల్మిక్ అధికారి యేసుపాదం ఆధ్వర్యంలో 41వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైద్యాధికారిణి నాగదివ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రాలను దానం చేయడం వల్ల మరొకరికి కంటి చూపును అందించినవారవుతారన్నారు. పోషకాహార లోపం, ఇన్ఫెక్షన్, గాయాల వంటి వాటి వల్ల కంటి సమస్యలు పొంచి ఉంటాయని, అటువంటి వారికి దానం చేసిన కంటి నల్లగుడ్డు పొరను అమర్చి దంతో చూపు అందించవచ్చన్నారు. విటమిన్-'ఏ' అధికంగా ఉన్న ఆహారాలు తరచూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నాగేంద్రుడు, పీహెచ్‌సీ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శిథిల ట్యాంకులు.. తాగునీటికి వెతలు

కూనవరం, అడ్డతీగల, వై.రామవరం, దేవీపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలో పలు మండలాల్లో గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించే రక్షిత నీటి పథకం ట్యాంకులు శిథిలావస్థకు చేరుతున్నాయి. నిర్వహణ లోపంతో ట్యాంకుల గోడలు దెబ్బతిని, రెయిలింగ్ విరిగి ప్రమాదకరంగా మారాయి. కొన్నిచోట్ల పెచ్చులు ఊడి ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తున్నాయి.

పరిశీలన

నిర్వహణ సక్రమంగా లేక..

వై.రామవరం మండలంలో ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా మంచినీరు అందిస్తున్న అది అంతంత మాత్రమే. మండల కేంద్రంలో రెండు రక్షిత మంచినీటి ట్యాంకులు ఉన్నా వాటి నిర్వహణ సక్రమంగా లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతూ ఉంటారు. వేసవి కాలం వస్తే మంచినీటి సమస్య తలెత్తుతుంది. యార్లగడ్డ, దొండపాలెం, పి.ఎర్రగొండ, పనసపాలెం, చవిటిదిబ్బలు, దేవరమడుగుల గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు ఉన్నప్పటికీ, వాటికి క్లోరినేషన్ ఎప్పుడు చేశారో తదితర తేదీల వివరాలను బోర్డులలో రాయట్లేదు.

వృథాగా పోతున్న తాగునీరు

కూనవరం అటవీశాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న టేకులబోరుకు చెందిన ట్యాంకులో నీరు నిండి వృథాగా పోతున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. వారికి గుర్తు వచ్చినప్పుడు వచ్చి ఆపుతున్నారు. టేకులబోరులో కొన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా సక్రమంగా జరగక ఇబ్బందులు పడుతున్నారు.

పూర్తిగా ధ్వంసమైన మెట్లు

అడ్డతీగల మండలం పైడిపుట్ట గ్రామంలో తాగునీటి ట్యాంకు మెట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ట్యాంకు నుంచి నీరు వస్తున్నప్పటికీ, దాని మెట్లు లేక నిర్వహణ సక్రమంగా జరగడంలేదు. వాటర్ ట్యాంకు క్లోరినేషన్ ఎప్పుడు చేశారో కూడా తెలియదని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి మూలమైన తాగునీటి ట్యాంకు నిర్వహణపై సంబంధిత అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎప్పుడు కూలిపోతుందో తెలియదు

దేవీపట్నం మండలంలోని పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలైన [illegible] గిరిజన నిర్వాసితులకు పెదభీంపల్లి ఆర్అండ్ఆర్ పునరావాస కాలనీ-1లో 2006లో ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఈ కాలనీలో తాగునీటి ట్యాంకు నిర్మాణం చేసి 20 ఏళ్లు కావడంతో అది ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. ట్యాంకు మెట్లు పూర్తిగా విరిగిపోవడంతో దానిని శుభ్రం చేసే పనులు నిలిచిపోయాయని గ్రామస్థులు చెబుతున్నారు. తాగునీటి ద్వారా నాచు వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు శ్రీపురంలో ఎమ్మెల్యే పర్యటన

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలం దొరచింతలపాలెం పంచాయతీ శ్రీపురం గ్రామంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీతో పాటు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు గురుకు శేషుకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి హాజరవుతారన్నారు. కార్యక్రమానికి తెదేపా నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు గ్రామ కమిటీ అధ్యక్షులు, తదితర అనుబంధ కమిటీ ప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థిని మృతిపై జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు

కూనవరం, న్యూస్‌టుడే: కోతులగుట్ట గురుకుల పాఠశాల విద్యార్థిని జాహ్నవి మృతిపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను తెలిపారు. విద్యార్థిని మృతిలో ఉపాధ్యాయులు, వైద్యుల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తుందన్నారు. వీరిపై జిల్లా సంయుక్త కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఉన్నతాధికారులు విచారణ చేసి బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి తక్షణ సాయంగా రూ.రెండు లక్షలు, పరిహారంగా రూ.25లక్షలు, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఎటపాక: కూనవరం మండలం కోతులగుట్ట గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తెల్లం జాహ్నవి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సమాఖ్య జిల్లా నాయకుడు వాసం రాము సోమవారం డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ జాహ్నవి రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నా, ఆ విద్యార్థిని పరిస్థితిని తల్లిదండ్రులకు తెలియజేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఉన్నతాధికారులను కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 రంపచోడవరం 9490877172 అడ్డతీగల 9491575045 దేవీపట్నం 7673936638 గంగవరం 9493541083

సమస్య: మారేడుమిల్లి- బోదులూరు ప్రధాన రహదారిలోని వేటుకూరు కూడలి వద్ద రహదారి అంచులు కోతకు గురవడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. చర్యలు చేపట్టాలి. – భాస్కరరావు, మారేడుమిల్లి

సమాధానం: రహదారి కోతకు అవసరమైన మరమ్మతులు చేపడతాం. – ప్రదీప్, ఏఈ, ర.భ. శాఖ, మారేడుమిల్లి - **న్యూస్‌టుడే, మారేడుమిల్లి**

చెత్త తొలగించారు

స్పందనకు వందనం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: అన్నవరం వాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన తూరల వద్ద భారీగా తుక్కు చేరింది. దీనిపై గురువారం 'ఈనాడు'లో 'అడ్డుపడ్డ తుక్కు.. తీయకుంటే ముప్పు' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి, సిబ్బందితో తుక్కుని తొలగింపజేశారు. వంతెనకు మిగిలిన పనులు కూడా చేపట్టారు. దీనిపై భారీ వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు అడ్డు పెట్టారు. తాత్కాలిక మట్టిదారిని సిద్ధం చేశారు.

సమ్మె నోటీసు అందజేత

కూటూరు వైద్యాధికారికి నోటీసు అందిస్తున్న సిబ్బంది

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరం, కూటూరు పీహెచ్‌సీలలో వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది సోమవారం వైద్యాధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే తదుపరి కార్యాచరణకు సిద్ధమని తెలిపారు. దారమ్మ, ఝాన్సీ, సీత, బజారు, రాము, అరుణ, లలిత, అర్జున్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి పరుగులు: ఎమ్మెల్యే

రామన్నపాలెంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. సోమవారం రంపచోడవరం మండలం ఊట్ల, రామన్నపాలెం గ్రామాల్లో మండల తెదేపా అధ్యక్షుడు పెంటపాటి అనంతమోహన్ ఆధ్వర్యంలో 'రెండేళ్ల నమ్మకం-సంక్షేమం అభివృద్ధి'పై ఇంటింటికి తెదేపా కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా పాలనలో జరగని అభివృద్ధి రెండేళ్లలో సీఎం చంద్రబాబు చేసి చూపించారన్నారు. కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. సామాజిక పింఛన్లు, స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, అన్న క్యాంటీన్ల ఏర్పాటు వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కోసు నాగన్నదొర, అరకు పార్లమెంటు ఉపాధ్యక్షుడు అడబాల బాపిరాజు, బాపనమ్మతల్లి ఆలయ ఛైర్మన్ కుంజం బాపన్నదొర, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పండా చెల్లన్నదొర, మాజీ సర్పంచులు ముర్రం లక్ష్మి, వంతల అచ్చియమ్మ, మడకం బాపన్నదొర, బుడ్డిగ రాజేంద్రప్రసాద్, సిద్ధా వెంకన్నదొర, సత్య, శేషాయమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసుల ఆందోళన

పెసా కమిటీ అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీలోని అల్లూరి కాలనీవాసులు సోమవారం తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. గత కొన్నిరోజులుగా అల్లూరి కాలనీలో మురుగునీరు రహదారులపై నిలిచిపోవడం వల్ల దోమలు పెరిగి, అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయన్నారు. వీధిదీపాలు వెలగకపోవడంతో రాత్రివేళల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధులు బయటకు రావటానికి భయపడుతున్నారన్నారు. స్థానిక కార్యాలయంలో సంబంధిత అధికారులు లేకపోవడంతో పెసా కమిటీ అధ్యక్షుడు మడివి ఊలయ్యకు వినతిపత్రం అందించామన్నారు. దీనిపై పంచాయతీ అభివృద్ధి అధికారి గుంపెనపల్లి మోహన్‌రావును వివరణ కోరగా డ్రెయినేజీలపై అక్రమ కట్టడాల వల్ల మురుగునీరు ప్రవహించే దారిలేక రహదారిపై నిలిచిపోతుందన్నారు. ఈ సమస్యను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లి వాటిని తక్షణమే తొలగించామన్నారు. మంగళవారం మిగిలిన కట్టడాలను జేసీబీతో తొలగిస్తామన్నారు. కాలనీవాసులు వెంకటేశ్వరావు, శాంతిసుధ, చంటి, లోవలక్ష్మి, చల్లా తిరుపతిరావు, ఎస్కే జిక్రియా, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

దారంతా తుప్పలు.. రాకపోకలకు తిప్పలు



వై.రామవరం నుంచి చామగడ్డ, బండిగడ్డ, సింగవరం, నెల్లికోట, బురదకోట గ్రామాల మీదుగా జంగాలతోట రహదారిలో ఇరువైపులా తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలను దాటించడానికి వీలులేని పరిస్థితి నెలకొంటుందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వై.రామవరం

పాఠశాల చెంత.. శిథిలభవనంతో చింత

మారేడుమిల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పూజారిపాకలు గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న శిథిల భవనం కూలిపోయేలా ఉంది. విద్యార్థులు ఖాళీ సమయంలో ఆ శిథిలభవన ప్రాంగణంలోనే ఆడుకుంటున్నారు. దీంతో ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గ్రామస్థులు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి శిథిలభవనాన్ని తొలగించే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మారేడుమిల్లి

సమావేశంలో మాట్లాడుతున్న జనసేన మండలాధ్యక్షుడు సాయి

అభ్యర్థుల విజయమే లక్ష్యం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: రానున్న ఎన్నికల్లో మన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ సూచించారు. వీఆర్‌పురంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి కష్టపడాలన్నారు. ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. 11 పంచాయతీల్లోని ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఆపార్టీ మండల కార్యదర్శి బాగుల అంజరావు, వీర మహిళా ప్రమీలరాణి, పోసిరెడ్డి, పవన్, సమ్మరాజు, వేణుబాబు, శ్రీరామ్, బోసు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: గతంలో సొసైటీల ద్వారా రుణాలు తీసుకునే రైతులు ప్రత్తిపాడు, కోరుకొండ తదితర సమీప సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ఛార్జి డిక్లరేషన్ బాండ్ రిజిస్ట్రేషన్ చేయించుకొని రుణాలను తీసుకొనేవారని రాజవొమ్మంగి సొసైటీ అధ్యక్షుడు ముప్పన కేశవ్ అన్నారు. ప్రస్తుతం రంపచోడవరం నియోజకవర్గాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి వేరు చేశాక ఈ బాండ్ రిజిస్ట్రేషన్ చేయడం నిలుపుదల చేశారన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరలా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను రంపచోడవరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చేసే విధంగా ఉత్తర్వులు ఇచ్చి రైతులకు సొసైటీల ద్వారా రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు 12 మండలాలకు చెందిన పీఏసీఎస్ ఛైర్మన్‌లు సోమవారం రంపచోడవరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు కేశవ్ తెలిపారు. పీఏసీఎస్ ఛైర్మన్లు హరిబాబు, అర్జున్, బాబూరావు, రాజారెడ్డి, కొండారెడ్డి, చంద్రయ్య, చిట్టిబాబు, రాజేష్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మండలంలోని జడ్డంగి మడేరు ఆనకట్టకు వెళ్లే రహదారి పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. పర్యాటక ప్రాంతమైన అక్కడకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడం, విస్తరణలో భాగంగా రోడ్డు ఎత్తుగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందిపడేవారు. సమస్యను ఇటీవల ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి మాజీ సొసైటీ ఛైర్మన్ జి.తాతారావు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత సిబ్బందితో మాట్లాడి పనులను ప్రారంభించారు. పనులను తెదేపా బృందం గంగాధర్, పండుబాబు పరిశీలించారు. జాతీయ రహదారి నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో పనులు జరుగుతుండడంతో పర్యాటకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జడ్డంగి మడేరు ఆనకట్టకు వెళ్లే రహదారిలో పనులు

వినతులకు పరిష్కారం చూపించండి

☛ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్

గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ, ఆర్డీవో

రంపచోడవరం, న్యూస్‌టుడే: గ్రీవెన్స్‌లో అందజేసిన ప్రతి వినతిపత్రాన్ని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏలో జేసీ ప్రశాంత్‌కుమార్, ఆర్డీవో స్వాతితో కలసి కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించి వినతులను స్వీకరించారు. జిల్లాలో వివిధ గ్రామాల నుంచి 368 వినతులను అందజేశారు. ఐటీడీఏ ఏపీవో డీఎన్వీ రమణ, వెటర్నరీ డీడీ షరీఫ్, డీఆర్‌డీఏ పీడీ రత్నాకరరావు, డ్వామా పీడీ రాంప్రసాద్, వ్యవసాయ జేడీ రామ్మోహనరావు, డీఈవో శ్రీరామ్మూర్తి, జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ శ్రీనివాసరావు, డీఈ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యలు ఇవీ..

- దేవీపట్నం మండలం తున్నూరు గ్రామంలో 20 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకొనేందుకు సాగునీటికి మోటారును మంజూరు చేయాలని సాదల విజయభాస్కర్‌రెడ్డి, కల్యాణి, బచ్చెల శ్రీదేవి తదితరులు గ్రీవెన్స్‌లో వినతిపత్రాన్ని అందజేశారు.
- అడ్డతీగల మండలం మల్లయ్యపాకలు గ్రామంలో ఏళ్లతరబడి వ్యవసాయం చేసుకొంటున్న 21 మంది రైతులకు అటవీ హక్కుల చట్టం ద్వారా పట్టాలను మంజూరు చేయాలని గిరిజనులు కోసూరి సీతమ్మ, అజ్జమ్మ, వెంకటలక్ష్మి తదితరులు వినతిపత్రాన్ని సమర్పించారు.
- పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురైన దేవీపట్నం మండలం కొండమొదలు పంచాయతీ 15 కుటుంబాలకు ఆర్ అండ్ఆర్ ప్యాకేజీని మంజూరు చేయాలని, 18 సంవత్సరాలు నిండిన వారికి ప్యాకేజీని మంజూరు చేయాలని వేట్ల విజయ, చెదల నాగిరెడ్డి, వలల లక్ష్మణ్‌రెడ్డి, కదల నాగమణి తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు.
- గుర్తేడు మండలం పాతకోట పంచాయతీలోని 30 మంది కొండరెడ్డి (పీవీటీజీ) కుటుంబాలకు వ్యవసాయం చేసుకునేందుకు పవర్ టిల్లర్లు మంజూరు చేయాలని శివశంకర్‌రెడ్డి, లింగారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు అధికారులను వేడుకొన్నారు.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



రాజవొమ్మంగిలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న పెద్దిరాజు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: పేదల అభివృద్ధి, సంక్షేమం, ఆరోగ్యం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. రాజవొమ్మంగి పంచాయతీ ముర్లవానిపాలెంలో సోమవారం 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న పథకాలకు సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధిస్తుందన్నారు. తెదేపా నాయకులు సురేష్, మధు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం నిర్మించాలని వినతి

శిథిలావస్థలో గంగవరం జడ్పీ ఉన్నత పాఠశాల

రంపచోడవరం, గంగవరం న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గంగవరం జడ్పీ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని పెదగెద్దాడ ఎంపీపీ పాఠశాల హెచ్ఎం ఎం.రాజేశ్వరరావు (పూర్వ విద్యార్థి) సోమవారం జేసీ ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. స్లాబ్ నుంచి పెచ్చులూడుతున్నాయని, వర్షం నీరు కూడా లీకేజీ అవుతోందని వివరించారు. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ భయాందోళనతో విద్యాభ్యాసం చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై స్పందించిన జేసీ భవన నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు రాజేశ్వరరావు తెలిపారు.

3న సర్వసభ్య సమావేశం

వరరామచంద్రాపురం: రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఇమ్మాన్యూయెల్ తెలిపారు. అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలన్నారు. ప్రస్తుతం ఉన్న మండల పరిషత్ పాలకవర్గం ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు ఇది చివరి సమావేశం కావడం, ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపే విధంగా సభ నడపాలని ఆయన కోరారు.

సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి

మారేడుమిల్లి: ఉద్యోగులు తమ పదవీ కాలంలో ప్రజలకు అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎంపీపీ సార్ల లలితకుమారి అన్నారు. మారేడుమిల్లి మండల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన చంద్రశేఖర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో రత్నకుమారి, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

స్లాస్‌తో అంచనా.. చదువుకు భరోసా

- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు పరీక్ష

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనావేసేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాది స్టేట్ లెర్నింగ్ ఎచీవ్‌మెంట్ సర్వే (స్లాస్) నిర్వహిస్తోంది. జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 28న ఈ సర్వే జరిగింది. జిల్లాలోని 12 మండలాల్లోని ఎంపిక చేసిన 61 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చేశారు. ఇందుకోసం 118 మంది ఫీల్డు ఇన్వెస్టిగేటర్లు (క్షేత్రస్థాయి దర్యాప్తు అధికారులు)ను నియమించారు. ఆయా పాఠశాలల నుంచి విద్యార్థులు 100 శాతం హాజరయ్యేలా చూడాలని ఇప్పటికే విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడంతో సమన్వయకర్తలను అధికారులు నియమించారు.

గతేడాది వాయిదా వేసి

❖ గతేడాది 4, 6, 8 తరగతులకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పి విద్యాశాఖ ప్రకటించింది. అనివార్య కారణాలతో వాయిదా పడింది. ❖ విద్యా సంవత్సరం ముగియడంతో వారు పై తరగతులకు వెళ్లారు. సర్వేలో భాగంగా 5, 7, 9 తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల్ని అంచనా వేశారు. ❖ అయిదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు సర్వే నిర్వహించారు. ❖ 7, 9 తరగతుల విద్యార్థులకు 30 నిమిషాలు అదనంగా సమయం ఇచ్చారు.

నిర్వహణ ఇలా..

❖ ఒక్కో తరగతిలో విద్యార్థుల్ని మూడు బృందాలుగా విభజించారు. మొదటి బృందానికి తెలుగు, ఆంగ్లం, రెండో బృందానికి గణితం, ఆంగ్లం, మూడో బృందానికి గణితం, తెలుగు సబ్జెక్టులలో బహుళైచ్ఛిక ప్రశ్నలు ఇచ్చి జవాబులను ఓఎంఆర్‌షీట్‌లలో రాయించారు.

ఉత్తమ ఫలితాల సాధనకు

స్లాస్ పరీక్షలో విద్యార్థుల సామర్థ్యాలను మదింపుచేసి, ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో తెలుసుకునే అవకాశం ఉంటుంది. అందుకు అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు చేసేందుకు దోహదపడుతోందని డీఈవో జి.శ్రీరామమూర్తి, డీసీఈబీ సెక్రటరీ కె.ఈశ్వరరావు తెలిపారు. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపయోగపడుతుందన్నారు.

మండలం	పాఠశాలలు	విద్యార్థుల హాజరు
మారేడుమిల్లి	7	477
వై.రామవరం	3	144
రంపచోడవరం	7	486
రాజవొమ్మంగి	7	303
గంగవరం	3	119
దేవీపట్నం	3	108
అడ్డతీగల	7	357
కూనవరం	4	148
ఎటపాక	8	317
వీఆర్‌పురం	4	136
చింతూరు	8	438

జూనియర్ అసిస్టెంట్‌కు సత్కారం

వెంకటరాజం దంపతులను సన్మానిస్తున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ కార్యాలయ ఉద్యోగులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ విద్యాశాఖలో అటెండర్‌గా ఉద్యోగాన్ని పొంది జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది 32 ఏళ్ల పాటు సేవలందించి అందరి మన్ననలు పొందిన ఘనత తొగరు వెంకటరాజంకు దక్కుతుందని పీఎంఆర్‌సీ ఏటీవో బి.చిన్నబాబు, ఏఎంవో బి.మంగిరెడ్డి, సూపర్-50అధికారి బోండ్ల వరప్రసాదరావు కొనియాడారు. రంపచోడవరం మండలం ఇర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో వెంకటరాజం జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. వెంకటరాజం దంపతులను పలుశాఖల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

(c) eenadu